విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

గురువారం 4 జులై, 2024. 4పేజీలు

మంత్రి నారాయణను కలిసిన మందా కృష్ణమాదిగ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : అమరావతి రాజధానిలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణనుఎమ్మార్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి విజయం సాధించడం పట్ల మంత్రి నారాయణకు మంద కృష్ణ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజధాని పునః నిర్మాణ ప్రక్రియ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆదిశగా వేగవంతం చర్యలు చేపట్టాలని మంత్రిని మందా కృష్ణ కోరారు. అదే విధంగా ఎస్సీ సామాజిక వర్గాన్ని ఏబీసీడీలుగా విభజించి సమ ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తాం

జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : జిల్లాలో వ్యవసాయసీజన్కుముందుజలజీవన్ మిషన్ పథకం క్రింద చేపట్టిన పనులు పరిశీలిస్తామనిజలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచిద్ర కుమార్ పట్నాయక్ వెల్లడించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని శంకరన్ హాల్ లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జాయింట్ సెక్రటరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో జల శక్తి అభియాన్ పథకం క్రిందచేపట్టినవాటర్షెడ్స్,చెరువులు,కుంటలు, అభివృద్ధి పనులను పరిశీలిస్తా మన్నారు.జిల్లాలో జల శక్తి అభియాన్ క్రింద తరువాత భూగర్భ జలాలు పెరిగాయాలేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలిస్తామన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలను పెంచడానికి అవసరమైన సూచనలు చేస్తామన్నారు. ఈనెల 4వ తేదీ ఉదయ9.15 గంటలకు కలిగిరి మండలం సిద్ధన కొండూరు ,నాగ సముద్రం, కలిగిరి ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వింజమూరు మండలంలోని వింజమూరు, చాకలి కొండ,ప్రాంతాల్లో ,సాయంత్రం 3గంటలకు వరికుంటపాడు మండలంలోని తూర్పు చెన్నంపల్లి, రామాపురం గ్రామాల్లో పర్యటించి పనులు పరిశీలిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి,జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభన్ బాబు,డ్వామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం తగదు

మాజీ మంత్రి కాకాని,ఎమ్మెల్సీ చంద్ర శేఖర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు:నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూతెలుగుదేశం పార్టీ ప్రజలకు పెంచిన పెన్షన్లను అందజేయడం సంతోషకరమని అన్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టిడిపి నేతలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం సరి కాదన్నారు. నిష్పక్షపాతంగా తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్తో పాటు అన్ని హామీలను, పథకాలను అమలు చేసి మాట్లాడాలని అన్నారు. ఒక్కసారిగా పదుల సంఖ్యలో పార్టీ నాయకులు.. పేద ప్రజల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పేరుతో డబ్బులు ఇచ్చి అధిక ఫోటోలుతీసుకోవడాన్ని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రతి నెల లబ్దిదారులకు 1 వతేదీనే గౌరవంగా వారి ఇళ్ళ వద్దకే వెళ్లి పెన్షన్ అందించాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చి ఎలాంటి ఆర్భాటం లేకుండా నేరుగా ప్రజల ఇళ్లకు వాలంటీర్ మాత్రమే వెళ్లి పేదలకు పెన్షన్లు అందజేశారని తెలిపారు. కానీ తెలుగుదేశం పార్టీ వారు వాలంటరీ వ్యవస్థను రద్దుచేసి నిన్నటి రోజున ఒక యుద్ధ వాతావరణంలో పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. టిడిపి నేతలు అధికంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఫోటోలు తీయించుకొని హంగామా చేయడానికే పెన్షన్ పంపిణి కార్యక్రమాన్ని చేపట్టినట్లుందని అన్నారు .గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ పద్ధతిలో ఎలాంటి ఆర్భాటం లేకుండా ప్రజలకు గౌరవంగా సంక్షేమ పథకాలు అందించిందన్నారు రాబోయే రోజుల్లో పేదలకు ఇచ్చిన హామీలను తెలుగుదేశం పార్టీ అమలు చేసేలా పేదల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందని వారు చెప్పారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు

వేణుగోపాలస్వామి ఆలయ ఆధునీకరణకు చర్యలు: దేవాదాయశాఖ మంత్రి ఆనం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు :నెల్లూరు నగరం మూలాపేటలోని ప్రసిద్ధి ఆలయమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఆధునీకరిం చడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస రావుకు సూచించారు. బుధవారం సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్కు మంత్రి పలు సూచనలు చేశారు. వేణుగోపాలస్వామి దేవాలయం నిధులు, ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధంగా చేయాలని సూచించారు. అలాగే నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని తాను మంత్రి అయిన తరువాత తాను, మంత్రి నారాయణ కలిసి ఆలయాన్ని సందర్శించామని, ఆలయంలో ఎంతో ప్రసిద్ధి చెందిన అద్దాల మండపం పునర్నిర్మాణం చేపట్టేందుకు, మండపంలోని చారిత్రాత్మక చిత్రాల రూపకల్పన మొదలైన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు నగరంలోనే రంగనాథ స్వామి ఎంతో విలువైన ఆస్తులు వున్నాయని, పూర్తిస్థాయిలో ఆస్తుల వినియోగం, ఆదాయంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో చాలా ఆలయాలకు విలువైన ఆస్తులు, భూములు వున్నాయని, అయినసూ ధూపదీప నైవేద్యాలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వీటన్నింటిపై దృష్టి పెట్టనున్నట్లు ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

బీడు భూములను ఆక్రమిస్తున్న భూ బకాసురులు

రెవిన్యూ రికార్డులో అప్పటికప్పుడుకే భూ యజమానుల పేరుతో మార్పు
పట్టించుకోని అధికార యంత్రాంగం ఇబ్బందుల్లో భూ యజమానులు

విశాలాంధ్ర-సీతారామపురం: సీతారాంపురం మండలంలో బీడు భూముల ఆక్రమణ జోరుగా కొనసాగుతుంది రాత్రికి రాత్రే రెవిన్యూ రికార్డుల్లో భూ యజమానుల పేర్లు మార్పులు జరుగుతున్నాయి ఇది అంతా తెలిసిన అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ గ్రామాలలో చిచ్చు పెడుతున్నారు ఉదాహరణకి సీతారాంపురం జడ్పీ హైస్కూల్ పక్కనే ఉన్న సర్వే నెంబర్60/4 లో 60 సెంట్లు సెటిల్మెంట్ భూమి నారిశెట్టి అంకమ్మ భర్త సుబ్బయ్య పేరు మీద గత 70 సంవత్సరాల గా ఉంది అయితే ఇటీవల కొంతమంది తాసిల్దార్లు రాజకీయ నాయకుల ఒత్తిడి తో జేబులు నింపుకొని రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా సృష్టించి పేద ప్రజల కడుపు కొడుతున్నారు అదేవిధంగా ఈ విధంగా అదే విధంగా గత ఏడాది కంచ పోరంబోకు భూముల్లో రికార్డుల తార మారి చేసి దొరికిపోవడంతో గతంలో ఉన్న కలెక్టర్ వారిపై చర్యలు కూడా తీసుకొని రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేశారు ఈ సమయంలోనే తాసిల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ కూడా మాయమైనది. ఇదే అదునుగా భావించిన కొంతమంది భూ బకాసురులు బీడు భూములపై గద్దల వాలుతున్నారు నిన్నటికి నిన్న సీతారాంపురం ఎల్బిఆర్ కాలేజ్ సమీపంలో ఉన్న వాడ గోపయ్యకు చెందిన ఎకరాల 5.69 సెంట్ల భూమిని ఇతర జిల్లాల వారి పేరు రికార్డు సృష్టించారని ఒడ గోపయ్య కుటుంబ సభ్యులు మంగళవారం2.07.2024.తేదీన ప్రస్తుతం పని చేస్తున్న తాసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చితమకు అన్యాయం జరిగిందంటూతాసిల్దార్ కార్యాలయం కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్ గారు మీరైనా స్పందించండి.సీతారాంపురం మండలంలో బీడు భూముల తో పాటు ప్రభుత్వ భూములు కూడా భారీ సంఖ్యలో ఆక్రమణకుగురవుతున్నాయి. తాసిల్దార్ కార్యాలయం లో కూడా కంప్యూటర్ ఆపరేటర్ వద్ద నుంచి వీఆర్ఏల వరకు జేబులునింపుకుంటున్నారు ఇలా పేద ప్రజల కడుపు కొడుతున్న అధికారులను కొంతమంది స్పందించి ఏసీబీ కి కూడా పట్టించారు ఇకనైనా జిల్లాకి కొత్తగా వచ్చిన కలెక్టర్ గారైన స్పందించి సీతారాంపురంలో భూములు ఆక్రమణకుగురికాకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జయ భారత్ హాస్పిటల్ కంటి వైద్య పరికరాలకు విరాళం

15 లక్షలు విరాళం అందజేసిన గుణపాటి శ్యామలమ్మ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : జయభారత్ హాస్పిటల్ కంటివిభాగం వైద్య పరికరాలకు కీ. శే, గుణపాటి హరిచంద్ర రెడ్డి జ్ఞాపకార్థంవారి శ్యామలమ్మ, కుమారుడు ప్రసాద్ రెడ్డి (రెడ్డీస్ ల్యాబ్) రూ 15లక్షలు విరాళం బెజవాడ కృష్ణారెడ్డిద్వారా అందచేచ్చారు.ఈ మొత్తం తో కంటి వైద్యపరికరాలు ఫండస్ కెమెరా కొనుగోలు చేయడం జరిగిందని హాస్పిటల్ చైర్మన్ పొన్నలూరుసీతారామి రెడ్డి తెలిపారు.ఈ పరికరాలతో కంటి జబ్బుఉన్నవారికి నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని తెలియచేసారు అదే విధంగా రూ 123000/-లతో బెజవాడ శ్రీకృష్ణరెడ్డి వారి సోదరీమణులు జ్ఞాపకార్థం"స్లిటలాంప్ "అనే వైద్య పరికరాని విరాళంగా అందచేశారు.ఈ వైద్య పరికరాలు ను ప్రాంభించడం జరిగింది అని తెలిపారు. ప్రధాన కార్యదర్శి హరికుమార్ రెడ్డి మాట్లాడుతూ కేట్రాక్ట్ ఆపరేషన్స్ ఉచితంగా చేస్తునమని.అనేక మంది దాతలు వీటికిసహకరిస్తున్నారని పరికరాలు అందచేసిన దాతలకు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేసారు. ఈ కార్యక్రమంలోట్రస్ట్ సభ్యులు డాక్టర్ కృష్ణారెడ్డి,బాలుసుబ్బారావు, గుర్రం సుధాకర్ పాల్గొన్నారు.

ప్రతిపక్షంలోనూ పార్టీ జెండా

విశాలాంధ్ర-జలదంకి: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడు ఒకే విధంగా తెలుగుదేశం పార్టీ జెండా వీడకుండా పార్టీ అదినాయకుల ఆదేశాలను పాటిస్తూ, పులిగుంట మధుమోహన్ రెడ్డి పార్టీ పటిష్టతకు పాటుపడి జలదంకి మండలంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు ఎన్నో ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో మండల పార్టీ నాయకులకు కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇబ్బందులు ఎదురైనప్పుడు కూడా పార్టీ ఆదేశాలే శిరోధార్యమంటూ, పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మండల పార్టీ అధ్యక్షునిగా ఎవరూ ముందుకు రాని క్రమంలో ఆయన మండల పార్టీ బాధ్యతలు స్వీకరించి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. 2014లో మండల కన్వీనర్ గా ఉన్న మధు రెడ్డిని పదవి నుంచి తొలగించారు. 2019లో పార్టీ అధికారం నుంచి వైదొలిగిన సమయంలో పార్టీ మండల బాధ్యతలు స్వీకరించడానికి ఎవరు ముందుకు రాలేదు. ఈ క్రమంలో మరలా మధు రెడ్డికి మండల బాధ్యతలు అప్పగించారు. 2019 నుంచి 2024 వరకు దాదాపుగా కనిపించని కొందరు ఇటీవల మధు రెడ్డి పై విమర్శలు చేస్తుండడం పార్టీ అభిమానులకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయంపై పలువురు పార్టీ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా వీరంతా ఎక్కడ ఉన్నారంటూ ప్రశ్నిస్తున్నారు.

చిన్నారి ఆర్మాన్‌కి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: చిన్నారి షేక్ ఆర్మాన్ కొద్దిరోజులుగా లివర్ సమస్యతో విజయవాడలోని చిన్న పిల్లల రైన్బో హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. చిన్నారి తల్లిదండ్రులైన షేక్ ఆరిఫ్ షేక్ ఆఫ్రిన్లు ఆర్థిక ఇబ్బందులతో ఉండగా వైద్య సహాయానికి అయ్యే ఖర్చు నిమిత్తం, స్థానిక వ్యాపారి, మానవతావాది సురేష్ రెడ్డి వారికి పాతికవేల రూపాయలు (25,000/-) అందజేశారు. తదుపరి ఖర్చుల కోసం ఆయన స్ఫూర్తితో, సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ సహాయ సిబ్బంది, మిత్రబృందం మరియు యాజమాన్యం కలిసి యాభై వేల రూపాయల (50,000/-) నగదు అందజేసారు. ఇప్పుడు ఆర్మాన్ కోలుకొని తిరిగి రాగా, తల్లిదండ్రులు మాట్లాడుతూ దాతలు చేసిన సహాయాన్ని ఎప్పటికీ మరువబోమని జీవితాంతం వాళ్లకి రుణపడి ఉంటామని తెలిపారు. స్థానిక కందుకూరు సురేష్ రెడ్డి చికెన్ సెంటర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది, మిత్రబృందం పాల్గొన్నారు.

వ్యాపార వాణిజ్య సంస్థల్లో పారిశుద్ధ్య ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి

: మునిసిపల్ హెల్త్ ఆఫీసర్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : సీజనల్ వ్యాధుల నియంత్రణా చర్యల్లో భాగంగా కమిషనర్ వికాస్మర్మత్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యాపార వాణిజ్య సంస్థల్లో కార్పొరేషన్ సూచించిన పారిశుద్ధ్య ప్రమాణాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షిస్తున్నామని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ తెలిపారు. స్థానిక మినీ బైపాస్ లోని వెంగమాంబ పంజాబీ డాబా, రామలింగాపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలల ప్రాంగణాలను డాక్టర్ బుధవారం తనిఖీ చేశారు.డాబా ట్రేడ్ లైసెన్స్, ఎన్. ఓ.సి సెర్టిఫికెట్ లను పరిశీలించి మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. వంటశాలలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా, ఆహారాన్ని పరిశుభ్రంగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వంటగది వద్ద తగినంత గాలి, వెలుతురు ప్రసరించేలా, అగ్నిప్రమాదాలు జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీ చైతన్య కళాశాలలో తరగతి గదులు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను ప్రాంగణంలో పరిశీలించి మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మంచినీటి వసతిపై కళాశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రాంగణంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను క్రమంతప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. కళాశాలల్లోని ఆర్.ఓ వాటర్ ప్లాంట్ ల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించిన డాక్టర్ నిర్వాహకులకు వివిధ సూచనలు జారీచేశారు.ప్రజా ఆరోగ్య పరిరక్షణకు నగర పాలక సంస్థ సూచించిన అన్ని ప్రమాణాలను వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘించినట్లయితే లైసెన్సులు రద్దు చేస్తామని డాక్టర్ వెంకట రమణ హెచ్చరించారు.

తాటికొండ రామమూర్తి తృతీయ వర్ధంతి

విశాలాంధ్ర::కొండాపురం:: స్వర్గీయ తాటికొండ రామమూర్తి తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ నవీన్ సాయిపేట హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సాయిపేట పంచాయతీ కొమ్మిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పలకలు అందజేసారు. ఈ సందర్భంగా కొమ్మిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యులు అనిల్ మాట్లాడుతూ తాటికొండ రామమూర్తి నాయుడు సాయిపేట పంచాయతీ మాజీ సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షులుగా, గ్రామ పెద్దగా సాయిపేట పంచాయతీ అభివృద్ధికి ఎనలేని సేవలను అందించారు. ఈ రోజు తాటికొండ రామమూర్తి నాయుడు వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు నవీన్ సాయిపేట పంచాయతీలోని పలు పాఠశాలల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసారు. లైఫ్ లైన్ ఫౌండేషన్ ద్వారా నవీన్ చేస్తున్న సేవాకార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు.నవీన్ ప్రతి సంవత్సరం వారి తండ్రి జ్ఞాపకార్థం పలు సేవాకార్యక్రమాలు చేస్తున్నారనీ వారిని కొనియాడారు. ఈ సందర్భంగా హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు హసీనా మాట్లాడుతూ కీర్తిశేషులు తాటికొండ రామ్మూర్తి నాయుడుకి గ్రామ పెద్దగా మంచి పేరు వుందని అన్నారు. రామ్మూర్తి నాయుడు తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ నవీన్ విద్యార్థులకు పుస్తకాలు, పలకలు అందజేయటం అభినందనీయం అని అన్నారు. లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ నవీన్ మట్లాడుతూ మా నాన్నగారు లైఫ్‌లైన్ ఫౌండేషన్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలను ప్రోత్సాహించేవారని అన్నారు. సాయిపేటలో నిర్వహించే రక్తదాన శిభిరంలో పాల్గొని రక్తదాతలకు అభినందనలు తెలిపేవారనీ అన్నారు. లైఫ్ లైన్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నాడు. మా నాన్న గారి తృతీయ వర్ధంతి సందర్భంగా సాయిపేట పంచాయతీలోని విద్యార్థులకు పుస్తకాలు మరియు స్టేషనరీ అందజేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: చదువుకు పేదరికం అడ్డంకం కాదని ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మమ్మ అన్నారు.కందుకూరు జనార్ధన్ కాలనీలో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మోపాడు గ్రామానికి చెందిన తోకల వెంకటేశ్వర్లు పదివేల రూపాయలవిలువైన నోట్ పుస్తకాలు, పలకలు,పెన్నులు, ప్యాడ్లు, పెన్సిల్లు విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అలా ఎదిగినప్పుడే దాతలు చేసిన సేవకు ఫలితం ఉంటుందని అన్నారు. ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయిని జి రామలక్ష్మమ్మ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డం కాదని, ప్రభుత్వం విద్యార్థులకు అన్ని పథకాలను అందిస్తుందని ఆమె అన్నారు. కావున ప్రతి ఒక్క విద్యార్థి స్కూలుకు గైర్హాజరు కాకుండా క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె అన్నారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేసిన తోకల వెంకటేశ్వర్లను అభినందించారు.ఈ కార్యక్రమంలో సిఆర్‌పి ప్రతిభ, ఉపాధ్యాయులు పి శాంత కుమారి, బి. పద్మజ, జి రాధిక, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేరుశెనగలో ఉధృతంగా తామర పురుగు

విశాలాంధ్ర-ముత్తుకూరు: వేరుశనగ పంటలో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు తక్షణం దానిని నివారించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఇందుకూరుపేట ఏడిఏ రాజకుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్ కుమార్, జిల్లా వనరుల కేంద్రం డిడిఏ శివన్నారాయణలు తెలిపారు. బుధవారం మండలంలోని పంటపాలెం, బ్రహ్మదేవం పంచాయతీలలో రైతులు వేసిన వేరుశనగ పంటలను, రైతుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వేరుశనగ పంటలు తామర పురుగు అధికంగా ఉండడన్ని తాము గమనించడం జరిగిందన్నారు. దీని నివారణకు త్తయో క్లోప్రిడ్, పి ప్రో నిల్, అసిటా మీ ప్రిథ్ మందులను 20 రోజుల వ్యవధిలో పిచికారి చేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా స్వచ్ఛ దోమ నివారణకు ఇమిడాక్లో ప్రిడ్ వందనం పిచికారి చేయాలని సూచించారు. అనంతరం బ్రహ్మదేవుని పంచాయతీలో సమస్తతమైన పొలాలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ మట్టి పరీక్షల ప్రయోగాన్ని తెలియజేస్తూ మట్టి పరీక్షలు చేయించి దాని ప్రకారంగా యాజమాన్యం పద్ధతులను పాటించినట్లయితే సమస్యకమైన పొలాలలో అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పొలంలో మట్టి నమూనాలను తీసి విధానాన్ని ఏడిఏ రాజకుమార్ రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోత్స్నారాణి, విఏఏలు ప్రసన్నకుమార్ రెడ్డి, రమ, కరీం రైతు సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఐ ఈఎ వారోత్సవాలు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 74వ వారోత్సవాల సందర్భంగా కందు కూరు జీవిత బీమా కార్యాలయం లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జెండా వందనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి ఉద్యోగస్తులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం ఎల్ఐసి కార్యాలయంలో ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో ఆయుర్వేదిక్, హోమియో, యునాని ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో 200 మంది వైద్య సేవలు పొందారు. వారందరికీ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. వైద్యులు డాక్టర్ ఆర్‌టిఎస్ లక్ష్మికుమారి, కె.వి పద్మజాకుమారి, పి రత్నావళి తో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా సాయంత్రం వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సీనియర్ బ్రాంచి మేనేజర్ ఐ.వి.ఏ కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలందరికీ జీవిత బీమా కల్పించడమే లక్ష్యంగా ఎల్ఐసి పనిచేస్తుందని చెప్పారు. అదేవిధంగా ప్రజలు చేసిన పొదుపు ప్రజా సేవ కొరకే ఉపయోగించడం జరుగుతుందని వివరించారు. దేశ ఆర్థిక అభివృద్ధిలో ఎల్ఐసి పాత్ర ఎంతో ఉందన్నారు. ఎల్ఐసి పట్ల అందరూ అవగాహనతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్ ,కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి , సభ్యులు డివి రమణ, లక్ష్మీనారాయణ, ఈశ్వర్ ,సిబ్బంది, క్లాస్ 1 అధికారులు, డెవలప్ మెంట్ అధికారులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మార్వో కార్యాలయంలో

కాకర్ల తనిఖీలు

విశాలాంధ్ర-కలిగిరి : ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ నూతన పాలన విధానానికి నాంది పలికారు. కలిగిరి మండలంలోని తాసిల్దార్ కార్యాలయం ప్రజా పరిషత్ కార్యాలయం సచివాలయాలను బుధవారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. తాసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి అస్తవ్యస్తంగా ఉన్న రికార్డుల గురించి అడిగి తెలిసిన తెలుసుకున్నారు. విలువైన రికార్డులు చల్లాచెదురుగా పడి ఉండడం పట్ల ఒకింత అసహనం వ్యక్తం చేశారు. క్రమ పద్ధతిగా అమర్చుకోవాలని సూచించారు. ప్రజా పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే, విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న ఏపీఓ పట్ల అగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని తెలిపారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో అధికారులలో కలకలం మొదలైంది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వెంట తెలుగుదేశం పార్టీ కలిగిరి మండల అధ్యక్షులు బిజ్జం వెంకట కృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ కలిగిరి జనరల్ సెక్రెటరీ కాకు మహేష్, రావులకొల్లు సర్పంచ్ పూసాల వేంగప నాయుడు, రావుల కొల్ల సర్పంచ్

చదువుతోనే సమాజ మార్పు : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : సామాజిక మార్పు విద్యతోనే సాధ్యమని, ప్రతి చిన్నారి చదువుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో బాల కార్మిక నిర్మూలన చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేను బడికి పోతా అన్న కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. బడికి రాని పిల్లల్లో స్ఫూర్తి నింపే దిశగా విద్యార్థినీ విద్యార్థులు చేస్తున్న విస్తృత ప్రయత్నాన్ని ప్రశాంతి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా బడికి రాని పిల్లలు కూడా బడిలో చేరతారని అన్నారు. బాల కార్మికవ్యవస్థ సమూలంగా నిర్మూలించాలంటే ప్రతి తల్లి, తండ్రి పిల్లలను తప్పని సరిగా బడికి పంపాలని కోరారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదని, బడిలో ఉండాలని వ్యాఖ్యానించారు. చదువుతోనే బంగారుభవిష్యత్తుకు బాటలు వేయగలమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇనమడుగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్స్‌కు గౌరవవేతనాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : పాస్టర్స్ గౌరవ వేతనాన్ని కొనసాగించాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డం హనోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పాస్టర్స్ అనేవారుదేశం,రాష్ట్రంబాగుండాలని ప్రార్థించేవారని అలాంటి వారి కోసం వున్న ఏకైక పథకం గౌరవ వేతనమేనని అన్నారు. గత ప్రభుత్వం గౌరవవేతనం ఇచ్చేదని తెలియజేశారు. ఈసందర్భంగా నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సేవకుల సంక్షేమం కోసం గౌరవేతన పథకాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం భారతీయ క్రైస్తవ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కె ఎస్ రాజు, సదాశివరావు, ప్రధాన కార్యదర్శి ఏ రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాషువా, కోశాధికారి కిషోర్ కుమార్, సహాయ కార్యదర్శిలు శ్యామ్ ప్రసాద్, సుధీర్ బాబు, కార్యవర్గ సభ్యులు ఎనోష్, గిద్యోని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెంచాలి: ఎంఈఓ

విశాలాంధ్ర-ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థిని విద్యార్థుల నమోదు హాజరు శాతం పెంచాలని స్థానిక మండల విద్యాధికారి(1) షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు మండల పరిధిలోని అప్పసముద్రం చవటపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంగన్వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థుల పఠన అభ్యసన సామర్థ్య నైపుణ్యాలను పరిశీలిస్తూ విద్యార్థులకు తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాలకు సులభ రీతిలో ఉపాధ్యాయులు బోధించాలన్నారు. పాఠశాల మౌలిక వసతుల పురోగతి పనులను పరిశీలించి నిధులు ఉన్న పాఠశాలలలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని, ఆర్వో ప్లాంట్ ప్రతిరోజు వినియోగంలో ఉండేలా చూడాలన్నారు .మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి ప్రతిరోజు మెనూ ప్రకారము రుచికరముగా వంట తయారు చేయాలని సూచించారు. నూతనంగా ప్రవేశించిన 1తరగతి విద్యార్థుల కొరకు 90 రోజుల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నేను బడికి పోతా 6-14 సం విద్యార్థుల నమోదు , విద్యా ప్రవేశం కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

విశాలాంధ్ర-నెల్లూరు : విడవ లూరు మండలం రామతీర్థం గ్రామంలో వెలసియున్న శ్రీ కామాక్షి దేవిసమేత శ్రీ రామ లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నాడు రథోత్సవం విశేష భక్త జన సంద్రోహం మధ్యన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్ర మంలో పుష్పాలంకరణ, తెనాలి మ్యూజికల్ బ్యాండ్, తీన్మార్ డ్రమ్స్, స్పెషల్ డ్రోన్స్, గజ వాహన బొమ్మలు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదానతీర్థ ప్రసాదాలను అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమం బన్ కాపుల సంఘం ఆధ్వర్యంలో జరిగింది.

కాకర్ల సురేష్ కలిసిన కలిగిరి మండల నాయకులు

విశాలాంధ్ర-కలిగిరి: వింజమూరు మండలంలోని బొమ్మరాజు చెరువు సమీపంలో ఉన్ననియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిగిరి మండలానికి సంబంధించి ఎమ్మార్పిఎస్ నాయకులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారి వారి గ్రామాలలోని సమస్యలను వివరిం చారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు మరియు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ తరఫున తాను ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలవడానికి ఎమ్మార్పీఎస్ నాయకులు చాలా కష్టపడి పార్టీకి పనిచేసి మెజారిటీతో గెలవడానికి చాలా కృషి చేశారని తెలియజేశారు. తదుపరి వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోసాల కొండలరావు, నంది పోగు వెంగళరావు మాదిగ, కలిగిరి మండల అధ్యక్షులు, బొర్రా వెంగయ్య మాదిగ, కలిగిరి మండల అధ్యక్షులు, మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దు మస్తాన్, గోసాల ఆశీర్వాదం, శ్రీరామ్ నెహెమ్యా, నాయకులు నంది పోగు మహేష్, తుమ్మూరి సుధీర్, మరియు కలిగిరి మండల ఎంఆర్పిఎస్ నాయకులు తదితరులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ని కలిసి వారి సమస్యలను తెలియజేయడం జరిగింది

డెంగ్యూ, డయేరియాపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-జలదంకి: జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సోమవరప్పాడు సచివాలయంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు హెడ్మాస్టర్ శేషగిరిరావు అధ్యక్షతన జాతీయ డెంగ్యూ, డయేరియా నివారణ కార్యక్రమాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్. హరిప్రసాద్ మాట్లాడుతూ ఇంటి ముందు,ఇంటి పరిసరాలలో వ్యర్థ పదార్థాలు నిల్వ ఉంచుకోకుండా అందులో వర్షపు నీరు గాని, వాడుక నీరు గాని నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా డెంగ్యూ దోమలు ఉత్పత్తి కాకుండా చూసుకోవాలని ఇందుకుగాను ప్రతి ఒక్కరు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ప్రభాకర్ రావు, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ సిహెచ్ఓ శివ, ఏ.యన్.మ్. ప్రసన్న,ఆశ లు పాల్గొన్నారు.

బోరు నీటిని పరిశీలించిన హెల్త్ అసిస్టెంట్

విశాలాంధ్ర -రాపూరు : రాపూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని బోర్ లోని నీరు తాగుటకు పనికి వస్తాయే రావో టెస్ట్‌లు నిర్వహించిన బిట్ వన్ హెల్త్ అసిస్టెంట్ కాంతమ్మ ఏఎన్ఎం లతో కలిసి పరీక్షించారు. ఈ సందర్భంగా కాంతమ్మ మాట్లాడుతూ రాపూరు పట్టణంలోఅన్ని బోర్లలోని నీటిని పరిశీలించామని, అన్ని బోర్లలో నీరు తాగుటకు బాగున్నాయని. హెల్త్ అసిస్టెంట్ కాంతమ్మ తెలియజేసారు.

అక్రమ డీజిల్ దుకాణాలపై కొరడా

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల కేంద్రంలోని జాతీయ రహదారి కేంద్రంగా గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న అక్రమ డీజిల్ వ్యాపారాలపై మండల రెవెన్యూ సిబ్బంది తాసిల్దార్ అధ్యక్షతన దాడులు నిర్వహించారు ఈ సంద ర్భంగా పలు దుకాణాలపై దాడులు నిర్వహించి సుమారు 2000 లీటర్లు అక్రమ డీజిల్‌ను గుర్తించి వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలవపాడు తసీల్దార్ తెలిపారు. ఈ విషయం గత కొన్ని సంవత్సరాల నుండి పలు పత్రికలు ఉన్నతాధికారుల సైతం విన్నపించిన ఏమాత్రం పట్టినట్టు వివరించిన అధికారుల ఇప్పుడు ఒక్కసారిగా మెరుపు దాడులు చేసి అక్రమ డీజిల్ వ్యాపా రాలపై కొరడా జరిపించడంతో మండలంలో చర్చనీయాంసమైంది.

ఫారెస్టు కార్యాలయంలో చిత్రపటాల బహూకరణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన ప్రకారం అన్ని ప్రభుత్వ కార్యాలయార లో డిప్యూటీ ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని కూడా ఉంచవలసిందిగా గుర్తు చేస్తూ ఫారెస్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్ అనుమతితో ఫారెస్ట్ ఆఫీసు నందు చిత్రపటాలని ఉంచడం జరిగింది. తమ రేంజ్‌లో ఏదైనా అవినీతి జరిగితే తమ దృష్టికి తీసుకురావా ల్సిందిగా అధికారులు తెలిపారు. జనసైనికుల కోరిక మన్నించి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని కార్యాలయంలో ఉంచుకున్న అధికారులకు జనసేన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అటవీశాఖ అభివృద్ధి పదంలో నడవాలని జన సైనికులైన బ్రాహ్మణ యువకులచే ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తో పాటు నగర కార్యదర్శి మహేష్శర్మ,వినయ్,మనోజ్,సూర్య, దుర్గ,సురేష్ ప్రశాంత్ గౌడ్ హేమచంద్రయాదవ్,మౌనిష్,వర,ఇషాక్, బన్నీ,చిన్నరాజా, శీను వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చిత్రపటాల బహూకరణ

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడు లోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను తెలుగుదేశం మరియు జనసేన పార్టీ నాయకులు అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు అయ్యప్ప, మాభాష, చిలకా ప్రసాదు, నాగేశ్వరరావు తెలుగుదేశం నాయకులు డాక్టర్ కరీం బాపనపల్లి సుబ్రహ్మణ్యం బాపనపల్లి డాక్టర్ పవన్ కుమార్ శ్రీ ఆడియో ఆంజనేయులు తూనుగుంట్ల దివ్య నంద్ గుప్తా బడితల సాంబమూర్తి గిరి పలువురు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర-కందుకూరు రూరల్: కందుకూరు కోవూరు రోడ్డు నందు ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక వికలాంగుల పాఠశాలలో ఎల్ఐసి ఏజెంట్, శ్వేత ఫోటో స్టూడియో యజమాని గోనుగుంట వేణు, శ్రీలక్ష్మీల పెళ్లిరోజు సందర్భంగా బుధవారం మానసిక దివ్యాంగులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల మధ్య పెళ్లిరోజు జరుపుకోవడం ఓ అదృష్టం అని అన్నారు. పుట్టినరోజులు పెళ్లి రోజుల సందర్భంగా ఇలాంటి దివ్యాంగులకు సేవ చేయటం ఎంతో పుణ్యమని అన్నారు. దివ్యాంగుల సేవ దైవ సేవతో సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో వేణు దంపతులు, వారి కుటుంబ సభ్యులు, గోనుగుంట చంద్ర, మున్నలూరు సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు జగన్మోహన్ రెడ్డి నెల్లూరు రాక

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: మాజీ ముఖ్యమంత్రి ,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేతవైయస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం నెల్లూరులో పర్యటించనున్నారు. ఉదయం హెలికాప్టర్ ద్వారా తాడేపల్లి నుండి బయలుదేరి 11:00 ని.లకు కనుపర్తిపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డు మార్గాన బయలుదేరి నెల్లూరు సెంట్రల్ జైల్ చేరుకుని మాచర్ల మాజీ శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించిన అనంతరం మధ్యాహ్నం గం.12:00 లకు తిరిగి కనుపర్తిపాడుకు చేరుకుని హెలికాప్టర్‌లో తాడేపల్లి బయలుదేరుతారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాలపై డబ్ల్యూహెచ్ఓ వైద్యాధికారి పరిశీలన

విశాలాంధ్ర -మనుబోలు : ప్రభుత్వం అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలపై డబ్ల్యూ.హెచ్ ఓ వైద్యాధికారి మోనిక ఆకస్మికంగా పరిశీలించారు. బుధవారం ఆమె మనుబోలు, బద్దెవోలు గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు కాలపరిమితి ఉన్నాయా ప్రభుత్వం అందిస్తున్న అన్ని టీకాలు చెక్ లిస్ట్ ప్రకారం ఉన్నాయా లేవా సరైన గదులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఆమె వెంట స్థానిక వైద్యాధికారి సయ్యద్ మోహసీన్ సుల్తానా, ఏ.ఎన్.ఏం సుభాషిణి,మీరమ్మ, అంగన్ వాడి కార్యకర్త నిర్మల తదితరులు ఉన్నారు.

ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు

విశాలాంధ్ర- ముత్తుకూరు: దేశ చరిత్రలో ఎన్నడూ ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదవాడు ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని జనసేన సర్వేపల్లి నియోజకవర్గం కన్వీనర్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీఏ ఓటమి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఐదువేల రూపాయలు ఇచ్చి వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. అదే వాలంటరీ ఉద్యోగం కాకుండా ఉంటే ఆ వ్యక్తి మరో ఉద్యోగానికి వెళ్లి సంపాదించుకునే వాడని నేడు వాలంటీర్ల పరిస్థితి అయోమయంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.. అలాగే మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి నియోజకవర్గంలో చేసిన అవినీతి అక్రమాలు అన్ని ఇన్ని కాదన్నారు. వైసిపి నాయకులను అడ్డం పెట్టుకుని స్థానిక రెవెన్యూ అధికారులు భూములను రక్షించాల్సిన వారే కబ్జా చేసి, వైసీపీ నాయకుల అన్న చేసుకుని రెవిన్యూ స్థలాలను కాలువలను ఆక్రమించి రూములు కట్టుకొని బాడుగులకు ఇచ్చుకుని రాజభోగల అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి భూములన్నింటినీ కూడా తిరిగి బయటకు తీస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన సర్వేపల్లి నియోజకవర్గం వీర మహిళా గంగాభవాని, స్థానిక జనసేన నాయకులు రహీం పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు,
కళావేదికలు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు మండలంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బచ్చుఅమర చారిటబుల్ ట్రస్ట్ అధినేత ప్రవాస భారతీయుడు బచ్చుకృష్ణ కుమార్ ఆర్థిక సహాయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను కళా వేదికలను బుధవారం కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఎన్ఆర్ఐతో కలసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా కప్పరాలతిప్పకూడలి నుండి కళాశాలవరకు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలోని సరస్వతి విగ్రహానికి పూలమాలలువేసి శిలాఫలకాన్నిఆవిష్కరించిన అనంతరం రిబ్బన్ కట్ చేసి తరగతి గదులను ప్రారంభించారు. ఏ దేశంలోఉన్నప్పటికీ పుట్టిన గడ్డకు మేలుచేయాలనే సంకల్పంతో విద్య, వైద్యం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న కృష్ణ కుమార్, సంధ్యదంపతులను ఎంఎల్ఏ అభినందించాడు. అనంతరం విశ్వనాథరావుపేట పంచాయితీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన తరగతి గదులను కళావేదికను ఆయన ప్రారంభించాడు. పై కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ మాజీచైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు కొండ బిట్రగుంట దేవస్థానం మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ ,విశ్రాంత ఇంజనీర్ గోపికృష్ణ మండలంలోని పలువురు తెలుగుదేశం నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే తమ లక్ష్యం: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పని చేయడమే తమ లక్ష్యమని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం కోవూరు మండలంలోని ఇనమడుగులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సంబంధ విషయాలపై స్థానిక వైద్య సిబ్బందితో చర్చించారు. పరీక్షలకు సంబంధించి ల్యాబ్టెక్నీషియన్ను అడిగి వివరాలు ఆరా తీశారు. ఇనమడుగు పిహెచ్‌సిలో అందిస్తున్న వైద్య సేవలు సిబ్బంది వ్యవహార శైలి గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలను పరిశీలించి వసతులు, సమస్యలను తెలుకున్నారు. ఈ సందర్భంగా రోగులనుపరామర్శించివారికి పండ్లు అందించారు. ఆరోగ్య వివరాలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా పని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రస్తుతం కోవూరు మండలంలో 80వేలమంది ఉండగా వాళ్లకు కేవలం ఒకపీహెచ్‌సీ మాత్రమే ఉందన్నారు. తప్పకుండా ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి రెండో పిహెచ్‌సి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పేదలే వస్తుంటారని, వారిపట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందిక ి సూచించారు. వైద్యారోగ్యంపై ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తోందని, అవి సద్వినియోగం అయ్యేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఇనమడుగు పిహెచ్‌సిలో స్థానిక డాక్టర్లు ఆమెదృష్టికి తెచ్చిన సమస్యలపై స్పందిస్తూ మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానన్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మక నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ గుర్తింపు సాధించిన విడవలూరు మండలంలోని రామతీర్థం పిహెచ్‌సిని ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ప్రమాణాలతో వైద్య సేవలు అందించాలని సూచించారు. స్థానిక సర్పంచ్ తదితర ప్రజా ప్రతినిధులు సైతం తరచూ ఆసుపత్రిని సందర్శించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి నిరంజన్, సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు, ఎఎన్ఎమ్ లతో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంపీపీ పార్వతి,ఎంపీటీసీ కొల్లా సునీల్ రెడ్డి, సర్పంచి ప్రమీలమ్మ, సుధాకర్‌రెడ్డి, గుత్తికొండ వెంకయ్య, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కమలాకరరెడ్డి, జనసేన నాయకులు గుడి శ్రీహరి రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య సమగ్ర శిక్ష నెల్లూరు వారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, యూనివర్సిటీ ఆఫ్ మెల్బోర్న్ వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలయందుఎనిమిదవ తరగతినుండి సీనియర్ ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం పాఠశాలలో ఉపాధ్యాయులు విజయవంతంగా నిర్వహించేందుకు జూలై 1 నుండి 3వ తేదీ వరకు అవెన్యూస్ ఇంటర్నేషనల్ స్కూల్ ,నెల్లూరు జిల్లాకు చెందిన 20 పాఠశాలల హెడ్మాస్టర్లు, టీచర్స్, జూనియర్ లెక్చరర్స్ కు ఆ తరగతులు నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు , ఏపీసీ సమగ్ర శిక్ష ఉషారాణి, స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ శారద కుమారి, ఆర్ఐఓ శ్రీనివాస్, గ్లోబల్ ఎడ్యుకేషన్ సొసైటీ సీఈవో రాక్వెల్ శరఫ్, మధుబాబు, సుధీర్ బాబు,మండల విద్యాశాఖ అధికారి మురళీధర్ పాల్గొన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుండే ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు, అందుకు కావలసిన అర్హతలు, నేటి సమాజ పరిస్థితులు అనుగుణంగా మారే వృత్తుల పట్ల అవగాహన పెంచి స్కిల్ నేషన్ గా భారతదేశాన్ని నిలబెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. నెల్లూరు జిల్లాలో మోడల్ స్కూల్స్, కేజీబీవీ స్కూల్స్, జిల్లా పరిషత్ హై స్కూల్స్, జూనియర్ కాలేజెస్ అధ్యాపకులకు ఈ కార్యక్రమంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. డిఇఓ రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ఎనిమిదవ తరగతి నుండే పాఠ్యాంశాలతో పాటు జీవన నైపుణ్యాలు పెంపొందించుకుంటూ అవసరమైన వృత్తి నైపుణ్యాలు సాధించాలని విద్యార్థులను కోరారు. ఎనిమిదవ తరగతి నుండి కెరియర్ ఎడ్యుకేషన్ యొక్క ప్రాధాన్యతను వివిధ వక్తలు తెలియజేశారు. రోటరీ మాజీ గవర్నర్ సతీష్ మాట్లాడుతూ కెరీర్ ఎడ్యుకేషన్ కోసం తమ సంస్థ సహకారం విద్యార్థులకు ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు ఎడ్యుకేషన్ విజయవంతంగా అమలు చేస్తామని ఉపాధ్యాయులు ఉత్సాహంగా ప్రతిజ్ఞ చేశారు.

ప్రతి మండలంలో ప్రజా దర్బార్

రచ్చబండ కార్యక్రమంలో సమస్యలు పరిష్కారం

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్.

విశాలాంధ్ర-జలదంకి: ఉదయగిరి నియోజకవర్గం లోని ఎనిమిది మండల కేంద్రాలలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే యువనేత, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ బాబు ఆయన నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారని, ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. నియోజకవర్గంలో గడచిన ఐదు సంవత్సరాలలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని త్వరలోనే ప్రతి పంచాయతీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం చేసుకుందామని కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ సంయమనంతో ఉండాలన్నారు. కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా జమ్మలపాలెం నుంచి విజయోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రమైన జలదంకి లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత తాగునీటికి అన్నారు. నియోజక వర్గంలోని ప్రతి కుటుంబానికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందని ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. రెండవ ప్రాధాన్యతగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే అన్నారు. ఎన్నికలు జరిగిన తరువాత నుంచి తాను పలువురు పారిశ్రామిక వేత్తలను కలవడం జరిగిందని అన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి కి పరిశ్రమల స్థాపన తోనే అభివృద్ధి జరుగుతుందని,యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తాను అమెరికా వెళ్లానని అనుకుంటున్నారని, తాను అమెరికా వెళ్లలేదని, ఎన్నికలు ముగిసిన తరువాత నుంచి పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామికవేత్తలను కలిసి నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో పరిశ్రమలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ ప్రాధాన్యతగా రైతన్నలు పంటలు పండించుకునేందుకు కావలి కాలువ కు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గడచిన ఐదు సంవత్సరాల కాలంలో కావలి కాలువ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదని,ఈ విషయం అధికారులతో మాట్లాడితే తెలిసిందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా వింజమూరులోని తన కార్యాలయానికి వచ్చి నేరుగా తన దృష్టికి తీసుకురావాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని స్పష్టం చేశారు.